కథానిక

# టై

## తల్లావఝుల పతంజలి శాస్త్రి

ఎక్కువ ఎండగా లేదు. కిటికీ లోంచి చల్లటి గాలి వీస్తోంది. పక్క స్టేషను దాటిన తరవాత గానీ కృష్ణమూర్తి తన ఎదురుగా పక్కగా వున్న మనుషుల్ని చూడలేదు. మొహం మీదికి బలంగా గాలి తగుల్తూంటే హాయిగా వుంది ప్రాణానికి. కానీ టై కింది భాగాన్ని ఉడకేస్తూనే వుంది. యధాలాపంగా చూశాడతను. అతని ఎదుటి బెంచీ మీద ముగ్గురు కూచున్నారు. ఇద్దరు మొగాళ్ళు, నడి వయస్కులు. వారి మధ్య అదే వయసులో వున్న స్త్రీ. చివర కూచున్నతను జంతికలు నవుల్తున్నాడు. కాళ్ళు రెండూ ఎదుటి బెంచీ మీద ఆనించాడు మూర్తి. వాళ్ళ ముగ్గురూ అతన్ని అంతకు ముందే పరిశీలించారు. తను కూచున్న బెంచీ మీద ఇద్దరే వున్నారు. పక్కనే కూర్చున్న వ్యక్తి కొంచెం మాసిపోయిన చొక్కా, భుజం మీద తువాలు, రెండ్రోజులు పెరిగిన గడ్డంతో వున్నాడు. వాళ్ళ మాటలు కాసేపు ఆపినట్టుంది. తదేకంగా కిటికీ బయట సాగుతున్న కరెంటు తీగల్ని చూస్తున్నాడతను. ఓసారి అతనివేపు చూసి మళ్ళీ బయటికి చూస్తూ కూచున్నాడు కృష్ణమూర్తి. మళ్ళీ ఉత్తరం జ్ఞాపకం వచ్చింది. ఉత్తరం బయటికి తీసి చదవాలనిపించింది. పక్కనేవున్న వ్యక్తిని చూసి ఎందుకో తటపటాయించి జేబులోంచి చెయ్యి తీసేశాడు మూర్తి. నిజానికతనికి ఉత్తరం ఎప్పుడో నోటికి వచ్చేసింది. ఆ ఉత్తరం, అది రాస్తున్నప్పుడు తండ్రి ముఖం అతని కళ్ళల్లో ముద్రవేసుకుని వుండిపోయాయి. మళ్ళీ ఒకసారి వెళ్ళి బావగారి కాళ్ళు పట్టుకోమని తండ్రి ఉద్దేశం. అతని కళ్ళు చెమర్చేయి. రుమాలుతో కళ్ళు అద్దుకుని క్రీగంట పక్క వ్యక్తిని చూశాడతను. ఇద్దరి చూపులూ క్షణం పాటు కలుసుకున్నాయి. ఆ వ్యక్తి మళ్ళీ పొలాల్ని పరిశీలించడంలో నిమగ్నమై పోయాడు.

రెండు జతల బట్టలు సంచీలో పడేసుకుని, మరో రెండే రెండు నిముషాల్లో బట్టల్లో దూరి విమానంలా స్టేషన్లోకి వచ్చేసరికి ఎక్స్‌ప్రెస్ వెళ్ళిపోయింది. ఎక్స్‌ప్రెస్‌నీ పవరుపేట స్టేషన్నీ నిప్పెట్టి తగలెయ్యాలనిపించింది కృష్ణమూర్తికి. బెంచీ మీదికి బేగ్‌ని ఇంచుమించుగా విసిరేసి దాని పక్కనే కూలబడ్డాడతను. కోపంతో ఆందోళనతో అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. భుజం మీద నల్లకోటు వేలాడదీసుకుని ఎ.ఎస్.ఎం. అతని ముందుగా వెడుతూ కనిపించాడు.

"సార్, ఇప్పుడింక తెనాలి వేపు వెళ్ళే ట్రెయినేదైనా వుందా?"

"తెనాలి పోదుగానీ విజయవాడ వరకూ పది నిముషాల్లో ఫాస్టు పాసింజరు ఒస్తుంది. అక్కణ్ణించీ తెనాలి పెద్ద ప్రాబ్లం కాదుగదా"

టికెట్ కొనుక్కుని లోపలికి వస్తూండగా రెండో నంబరు ప్లాట్‌ఫాం మీదికి ఒస్తోందని వరసగా మూడు భాషల్లో ప్రకటన వస్తోంది. ఉన్న నలుగురైదుగురూ పట్టాల మీదుగా రెండోవేపు వెళ్ళిపోయారు. ఎవరో కృష్ణమూర్తికి చెయ్యి అందించారు. దూరంగా ఖాళీ బెంచీ మీద కూచుని సిగరెట్ వెలిగించాడతను. వీపంతా చెమటతో తడిసిపోయింది. టై కొంచెం ఒదులు చేసుకున్నాడు. ("అయితే టి.కె. మూర్తి ఫ్రమ్ పార్క్ డేవిస్ డాక్టర్") ఓ చేత్తో జేబు తడుముకోగానే నాన్న ఉత్తరం గరుగ్గా చేతికి తగిలింది. ఉదయం నుంచీ అయిదారుసార్లు చదివేడతను. ప్రతి అక్షరం ప్రతి వాక్యం అతనివీపుమీద నిప్పు కణికతో గీసినట్టయింది. గుండె లవిసేలా కంయిమంది రైలు. దడదడ తన మీదికే ఒస్తున్నట్టుగా ఒచ్చేసింది. ఆగే వరకూ నుంచుని ఎదురుగా ఆగిన పెట్టెలో కిటికీ దగ్గర ఖాళీ చూసుకుని కూచున్నాడు కృష్ణమూర్తి.

సిగరెట్ తీశాడు కృష్ణమూర్తి. పక్క జేబులోంచి తీసిన అగ్గిపెట్టె ఖాళీ. కాసేపు దానివేపు చూసి కిటికీలోంచి బయటికి పారేశాడు.

"తీసుకోండి" అగ్గిపెట్టె చేతికిస్తూ అన్నాడు పక్క వ్యక్తి. అతని వేపోసారి చూసి సిగరెట్ వెలిగించుకుని తిరిగి అగ్గిపెట్టె ఇస్తూ థేంక్స్ చెప్పేడు మూర్తి. కొంచెం నవ్వి అతను కూడా జేబులోంచి చార్మినార్ పెట్టె తీసి సిగరెట్ వెలిగించాడు. అగ్గిపెట్టె జేబులో వేసుకుంటూ అడిగేడతను.

"బెజవాడండీ మీరు?"

అవునంటూ తల ఊపేడు కృష్ణమూర్తి.

"నేనూ బెజవాడేనండి అంటే బెజవాడ గాదనుకో. ఒంగోలు బోవాలి. బెజవాణ్ణించి బస్సో రైలో వుంటానే వుంటాయి."

అతనివేపు చూశాడు కృష్ణమూర్తి. ఏమనాలో



తోచలేదు. అలాగా అన్నట్టు తల ఊపేడు.

"మీ స్వగ్రావం బెజవాడండీ!" మళ్ళీ అడిగేడా వ్యక్తి.

"తెనాలి. నేను ఏలూర్లో వుంటాను. అక్కడ వర్క్ చేస్తున్నాను."

"మాదీ ఒంగోలు గాదనుకోండి. ఒంగోలు దిగిపోవాలి. బస్సులు సక్రమంగా దొరికితే సాయంత్రానికి బోతాంలెండి."

దానికి ఏవనాలో కృష్ణమూర్తికి తెలీలేదు. తల కొంచెం ఊపి బైటకు చూశాడతను. చుట్ట తీసి నోరు ఖాళీ చేసుకుని ఎదురుగా కూచున్నతను అడిగేడు.

'ఈసారి పత్తి బాగానే ఉందంట గదండీ!"

పక్క వ్యక్తి లేచి జాగ్రత్తగా సిగరెట్టు కిటికీలోంచి బయట పారేసి కూచుంటూ అన్నాడు.

"బాగంటే బాగే. మూడేళ్ళ బొక్క వూడుసుకునే దారి లేదు. ఆ పొగాకు ఏసినప్పడే బాగుండేదండి. ఏందీ మందు లేందీ, వురుగులేందీ, రెండేళ్ళ కితం మా తోడల్లుడు వురుగుమందు తాగి గదూ పోయింది!"

జంతికలు తినే వ్యక్తి పక్కనే కూచున్న ఆడమనిషీ ముందుకు ఒంగి అతని వేపు ఆశ్చర్యంగా చూశారు. తేరుకుని ఆమే అడిగింది ముందు.

"ఏలూర్లో బంధువు లున్నారండీ మీకు!"

"బంధువేం కర్మ. అల్లుడే ఉన్నాడు. బిడ్డని జూసుకు పోదావని వస్తా వుంటాను"

"శానా దూరం ఇచ్చేరే"

"దూరవే అనుకో. ఈ రైళ్ళు బైళ్ళు ఒచ్చిం తరవాత దూరాబారం ఏందిలెండి. మా బావమరిది పొగాకు నారుకు రాజమండ్రి బోయేది. ఆణ్ణే దొరికేడీ అల్లుడుగారు."

అంతవరకూ నిశ్శబ్దంగా వున్న కృష్ణమూర్తి బెంచీ చివర వ్యక్తి కూడా మాటల్లోకి దిగేడు. పది నిమిషాల్లో పెట్టె అంతా అయిదుగురూ కలిసి మాటల పందిరి అల్లేశారు. కృష్ణమూర్తి టై చివర వేలికి చుడుతూ కూచున్నాడు. కృష్ణమూర్తి తండ్రికి ఇద్దరే పిల్లలు. కూతురికి పెళ్ళిచేసి నాలుగేళ్ళయింది. అల్లుడు కాలేజీ లెక్చరరు. క్లాసులో తక్కువా ఇంట్లో ఎక్కువా పాఠాలు చెప్పి డబ్బు సంపాదించడం అతని ముఖ్య వ్యసనం. రెండేళ్ళ నుంచి ఖాళీ వున్నప్పడల్లా పెళ్ళాన్ని హింసించడం మొదలు పెట్టేడు.

"మా ఆడబడుచుని కావిలి ఇచ్చానండి. బాగానే వున్నార్లెండి బగవంతుడి దయవల్ల."

"ఉండకే వుంది లేవే. ఏదో కాస్తంత పొలం, ఉండటానికో ఇల్లు. ఒకట్లెండి. మడిసి మంచోడు. తాగుడు బోగుడు లేవు. చీటికీ మాటికీ అన్నా ఇయ్యమని. చెయ్యి సాచే అవుసరం లేదు. ఆళ్ళ బతుకాళ్ళది. అంతే గదండీ" అన్నాడు ఆమె భర్త.


"అదీ ఎవుడేం జేస్తాడండి? మంచోడని పిల్లని చ్చేను. ఇద్దరు పిల్లకాయ


లండి. అయినా పిల్లని

పీక్కుతింటా వుండాడు. ఆ కొట్టడవేంది, తిట్టడవేంది. పెద్ద రచ్చయిపోయింది. నేనేణ్ణుంచి తెచ్చేదండి డబ్బు? నా కాడ మూటలు మూలుగుతా వుంటే అనుకోవచ్చు. పెళ్ళాం వుస్తె లమ్ముకుని మందులు కొని పొలాల క్కొడుతున్నావండీ. ఏంది చేసేది? మాదంతా ఒర్షాదారం గదండీ."

అతని మాటలు కృష్ణమూర్తి చెవులకి ఫెళ్ళున తగిలేయి. బావగారి దగ్గిరికి కనీసం నాలుగుసార్లు వెళ్ళేడతను. చిరునవ్వుతో కొత్తగా ట్యూషన్‌లో చేరే విద్యార్థిని పలకరించినట్టు స్నేహంగా మాట్లాడి, ఇచ్చిన మందు శాంపిల్సు తీసుకుని పంపించేవాడు. పది రోజులు తిరక్కుండా చెల్లెలి దగ్గిర్నించి బావగారి చెంప దెబ్బలతో కవరు ఒస్తుంది. భార్య పుట్టింటి డబ్బుమీద బతకాలనే వెధవల జాబితా తయారుచేయించి, బహిరంగంగా ఉరి తీయించాలనిపించేది కృష్ణమూర్తికి. చెల్లెలంటే అతనికి చాలా ఇష్టం. అయితే అతనికీ రెండేళ్ళలో ఒక విషయం తెలిసిపోయింది. ఆ జాబితా గనక తయారుచేస్తే నాలుగైదు సంపుటా లవుతాయని. మధనపడ్డాం తప్ప అతను ఎవరికీ చెప్పకోలేదు.

"...పెళ్ళాం మీద చెయ్యి చేసుకునే పెనిమిటి ఎదవ అనుకోండి. మొగోడే అయితే సంపాయించాలిగానీ ఆడదాన్ని కొట్టి సంపే బుద్ధి ఏటండి?" అంటోందామె. ఆమె భర్త నవ్వేడు. మిగతా అందరూ ఆమెతో అంగీకరించారు. పెళ్ళీ, భర్త, కర్మ, భగవంతుడు మొదలైన అంశాలమీద





వాళ్ళ జీవితానుభవాల కోణం నుంచీ అందరూ సత్యాలు మాట్లాడుతున్నారు. మూర్తి పక్కనున్న వ్యక్తి అంటున్నాడు.

"సెల్లెమ్మా, ఆడు అల్లుడై పోయాడుగానీ నాయాల్ని బర్రెను బాదినట్టు బాదేవోణ్ణి. సేతులు కట్టుకుని, ఆయనగారి కాళ్ళు పట్టుకుని బతిమాలేవండి. పస్తులున్నావంటే నమ్ము. వెయ్యి రూపాయిలు ఇచ్చి ఒస్తన్నానండి. కడుపులో బాద. ఏం జెయ్యాలండీ చెప్ప"

కృష్ణమూర్తి టై సర్దుకుని వింటున్నాడు. వాళ్ళ మాటలు అతనికి ఊరట కలిగించడం లేదు. అతనిలో బెంగ బుడగలా పెద్ద దవడం ప్రారంభించింది. టై బుడగ ముడిలా వుంది. సిగరెట్ తియ్యగానే పక్కనున్నతను మళ్ళీ అగ్గి పెట్టె ఇచ్చేడు. మళ్ళీ థేంక్స్ చెప్పి బయటకు చూస్తూ కూచున్నా చెవి వాళ్ళ మధ్య ఒదిలేశాడు. నూజివీడులో ఆగి బయలుదేరుతుండగా "టీయండీ టీ" వచ్చేడు. ఆడమనిషి తప్ప అందరూ టీలు చెప్పేరు. పక్క రైతు కృష్ణమూర్తిని అడిగేడు.

"టీ దీసుకుంటారండీ నువ్వు?"

ఒద్దన్నాడు మూర్తి. టీలవాడు డబ్బులు వసూలు చేసుకుంటూ అన్నాడు.

"ఇవాళ మూర్తం బాలేదండీ బాబూ. బేరాల్లేవు. ఏలూర్నుంచి పది టీలు కూడా అమ్మలేదండి. ఇలాగే అయితే పెళ్ళాం బిడ్డల్ని ఒదిలేసి సన్నాసుల్లో కలవాల్సిందేనండి. "

ఆమె నవ్వి "సన్నాసులెందుగ్గానయ్యా, బేరాలు బాగనే వుంటయిలే. ఎంతమందీ పిల్లలు! " అంది.

"ముగ్గురు. ఆపరేషను చేయించుకున్నాను. కొంప మునిగిపోను. వస్తానండి... టీయండీ టీసార్."

మరో పది నిమిషాల తరువాత తన పక్కనున్న వ్యక్తి పేరు ఆదిశేషు అని తెలిసింది మూర్తికి. మిగతా వాళ్ళ పేర్లు అంతుపట్టలేదు. ఆడమనిషి అంది.

"నా కొక్కతే ఆడపిల్లండి. కానుపు కష్టమైపోయింది."

"అసలు బతుకుద్దనుకోలేదు. ఆడజన్మకి ఎందుకట్టా రాశాడో గానీ, నా భార్య మళ్ళీ ఇంటికొచ్చుద్దనుకోలేదండి."

"అంతా దేవుడి దయండి. ఇంక పిల్లలు పుట్టకుండా పెద్దాపరేషన్చేశారండి. బయటపడ్డాననుకోండి. అంతేనండి. మాకు బాదల్లేవండి. పెద్దాపరేషనయి బతికే నాండీ అందరం పెత్తిరపతి ఎళ్ళి స్వామి దర్సెనం చేసుకుని షేమంగా ఇంటికొచ్చేవండి."

"అంతేలెండి. మన చేతులో ఏవుంటదండి! బావున్నావు, బాదల్లేవంటే దేవుడి దయే" ఆదిశేషు అనగానే తల వేగంగా తిప్పి అంగీకరిస్తూ అతని పక్కనున్న వ్యక్తి అందుకున్నాడు.

"ఏటయానికి ఏం జరుగుద్దో బ్రహ్మంగారి లాటోరికి తెలుస్తయి గానీ మనవెంత. ఏదో గంతకి తగ్గ బొంతలని ఇద్దరు కూతుళ్ళకీ మనువుల్చేసి సాగనంపేనండి. రెండెకరాల్లో ఎకరం మిగిలింది. మూడేళ్ళయి మా ఆడది పోయిందండి."

"అయ్యొయ్యొ"

"ఏం జబ్బండి అన్నయగారూ!" ఆమె కళ్ళు పెద్దవిచేసి అడిగింది.

"మనకేం దెలుస్తదండి! మా ఊళ్ళో డాట్రు బెజవాడ పొమ్మన్నారండి. పెద్దాసుపత్రిలో దిక్కే వుంది. ముందు కాసింత బువ్వ దినేదండి. తరవాత్తరవాత అదీ లేదు. పచ్చి గంగ దిగడం కష్టమైపోయిందండి. కచ్చితంగా నెలా తీసుకుని పోనే పోయిందండి."

"ఎంత గోరం!"

"కర్చులూ తప్పలేదు. తిరుగుడూ తప్పలేదు. మనిషి మాత్రం దక్కలేదు. దానికంటే, మనిషి పోయింతరవాత కుక్కని పారేసినట్టు బయట పారేశారండి. బాదేసిందండి. మా సర్పంచిగారూ ఆళ్ళూ ఈళ్ళూ పోగి సెవాన్ని ఊరికి దెచ్చి తగలేసేవండి. ఎన్ననుకుంటే ఏం లాబం! బాదల్లేవంటే చెప్తున్నానండి. బగమంతుడనేవోడు అందరికీ ఒకేలాగ రాయడు గదండి. ఏడిచినా ఒకటే ఏడవక పోయినా ఒకటే. అది బోయిన ఏడాద్దాకా నట్టింటో తిరుగుతున్నట్టే వుండేదండి. రెండు సుట్టలకంటే తాగితే నానా తిట్లూ తిట్టేదండి."

"కరెక్టయిన మాట చెప్పేవయ్యా, ఆశ్శేషుగారూ, ఎన్ననుకున్నా ఆడది ఇంట్లో తిరుగుతా వుంటే ఆదో నిబ్బరంగా వుంటదండి. నాలుగు తంతే మూలకిబోయి ఏడుస్తది. మళ్ళీ పిలంగానే ఓయంటదండి ఆడది."

"అంతే అంతే" అన్నాడు ఆదిశేషు. ఆడమనిషి పక్కనున్న వ్యక్తి సీమ వెండి గిన్నె తెరిచి అందరికీ జంతికలు పంచేడు. ఆదిశేషు జంతిక అందుకుంటూ కృష్ణమూర్తివేపు సందేహంగా చూసి ఏవనుకున్నాడో ఊరుకున్నాడు. వాళ్ళు మాట్లాడుతున్న మాటలన్నీ ఏటి కెరటాల్లా తాకుతున్నాయి కృష్ణమూర్తిని. వింటున్నకొద్దీ కడుపులో బుడగ పెద్దదవుతోంది. మెడను చుట్టుకున్న టై సర్దుకుంటూ చూసీ చూడనట్టుగా వాళ్ళందర్నీ పరిశీలనగా చూశాడతను. జంతికలు చప్పరించడంలో నిమగ్నమై వున్నారంతా. ఆదిశేషు రెండు కాళ్ళూ పైన పెట్టి మఠం వేసుక్కూచున్నాడు. హఠాత్తుగా కృష్ణమూర్తికి తన బావగారి గురించి చెప్పాలనిపించింది. అతని ఆలోచనలు విన్నట్టుగా ఆదిశేషు అన్నాడు.

"మీరు జేసే ఉజ్జోగం ఏంది సారూ?"

నన్నేనా అన్నట్టు అతని వేపు చూసి క్షణం ఆలోచించి చెప్పేడు మూర్తి. అందరూ అతని వేపే చూస్తున్నారు.

"మందుల కంపెనీలో మెడికల్ రిప్రజెంటేటివ్"

"స్వాగ్రావం తెనాలి"

"ఆ"

"కుటుంబం అంతా తెనాలండీ!"

"ఆ"

ఆమె ఏదో అడగబోయి ఊరుకుంది. టై ముడి నిమురుతూ కూచున్నాడు మూర్తి. ఆది శేషు కూడా అతనివేపు చూసి ఆగిపోయి ఆడమనిషిని చూస్తూ అడిగేడు.

"పిల్లలకి పెళ్ళిళ్ళయినయ్యాండీ?"

"ఒక్కమ్మాయేగదా. చేశానండి. దేవుడిదయవల్ల బాగున్నారు."

నిజవే చెప్తోందన్నట్టుగా వాళ్లాయన అందుకున్నాడు "పై సంబంధవేలెండి. బాగానే వున్నారు."

"దగ్గిరోళ్లు లేరా?"

"లేకేవండి. మా అక్క కొడుకే వున్నాడండి. అమ్మాయి పెద్దమనిషి అయినకాణ్ణించి ఆవెగారు ఇంటికి తరచూ వస్తాపోతా నా కోడలు నా కోడలని మొదలుపెట్టిందండి.

"సాయానా అక్కే?"

"తోడబుట్టిందేనండి. ఏమాటకామాట చెప్పకోవాల. మంచి మనసేనండి దానికి. మొగుడు ఒక్కరవ్వ తేడాపాడాలున్నా దుర్మారగం ఏవీలేదండి."

"మంచోళ్లేనండి పాపం. ఆళ్లదేం లోపం లేదండి" అంది అతని భార్య.

"కుర్రోడే సరైనోడు కాదండి. చిన్నవయసుకాణ్ణించే పెద్దతిరుగుళ్లు, పెద్దపోకిళ్లు ఎక్కువండి.

ఆ సీటికీ మాటికీ బెజవాడ రావడం, డబ్బులు కరుచుపెట్టడం, రావడం. ఇదండి ఆడిపని. ఓ పేకాటేటీ, మరోటేటీ ఇంక ఒకటిగాదులే. నాలుగు డబ్బులుంటే చేసేపన్లన్నీ చేసేవోడండి. అమ్మాయికంటే ఆరేళ్లు పెద్దండి."

"మా ఒదినిగారు అయన్నీ మాకు తెలవకుండా వుండాలని కదలన్నీ చెప్పేదండి. కన్నబిడ్డగదండి. ఆడేం జేసినా పైవోళ్లదగ్గిర, అందులో పిల్లని తెచ్చుకునేకాడ సమర్థించుకోవాలిగదండి. ఆవిడికీ తప్పదండి. ఎవరికేనా తప్పదండి. ఆ యబ్బాయికి తండ్రి బయం లేదండి, తల్లి బయం అసలికే లేదండి. ఏం జేస్తావండి."

బావగారికి అటువంటి అలవాట్లు లేవు. కానీ మనిషి మంచివాడు కాదు. తన స్నేహితులెవరికీ ఆయన గురించి తెలీదు. టై ముడి కొద్దిగా కిందికి లాగి చెవులు రిక్కించి వింటున్నాడు కృష్ణమూర్తి.

"చేసేదేవుందిలే. విజం జెప్పాలంటే ఆడికి కొంచెం చేతివాటం కూడా వుందండి. ఇంటోనే అనుకోండి. అయ్య డబ్బులూ అమ్మ డబ్బులూ లాగేసేవాడండి. అయన్నీ మాకు తెలీకుండుంటయ్యా? మా ఊరోళ్లు అక్కడికి బోరా అక్కడోళ్లు ఇక్కడికి రారంటూరా?"

"కుర్రోడి దేవూరండి?"

"ఆ, దగ్గిరేలెండి. అయిదురూపాయల చార్జీలు."

"మొత్తానికి పిల్లనివ్వలేదు" అన్నాడు జంతికల యజమాని.

"చూస్తా చూస్తా ఎలా ఇస్తావండీ? నేనిచ్చే డబ్బులూ తగలేసేసి, ఆడి డబ్బూ తగలేసి అమ్మాయిని గెంటేస్తే దిక్కేవుందండి. తెలీకండా జేస్తే ఆ దారివేరు. ఇంకది మన కర్మ. అది బతికినంతకాలం మనం, మనం బతికినంతకాలం అదీ ఏడవాలిసిందే."

"అంతగాకేందండి. తెలీకే గదా పిల్లనిచ్చుకుని. ఇప్పుడు యాతన్లుబడతన్నాం. దాని మొకం నేనూ నా మొకం అదీ చూసేదీ ఏడిసేదీ. అసలు క్రిష్ణ దాటి మా ఓళ్లెవరూ సంబంధాలు చెయ్యలా."

"ఇంకెందుకని ఇవ్వననేసావండి. ఈయనగారు ఏడన్నా మెత్తబడతాడని కరాకండీగా ఒదినిగారికి నేనే చెప్పేనండి. అలాగన్నానని కోపం పడ్డారండీయన."

"ఏహే. కోపం కాదండి. ఆ చెప్పేది నేనే చెప్పేఓణ్నిగదా. మరి నువ్వు చెడ్డయిపోలా. ఇప్పటికీ ఆవిడిగారు ముందీవిణ్నీ తరవాత నన్నూ తిడతా వుంటదండి. నేనూ జెప్పేలెండి. ఏడిసింది. ఓ బతిమాలింది. తిట్టింది. దాని మరిదిగార్ని రాయబారం అంపిందండి."

"పిల్ల గొంతుకోస్తావేటండి. కచ్చితంగా కూడదంటే కూడదన్నాం."

"అదుష్టం బావుండి మంచి సంబంధం చేసేంలెండి."

"సుకంగున్నారు. మాకూ బాదలేకండాబోయింది. ఆడదానికే గదండి అన్నీ. తెలీవింటో అడుగెట్టి ఆళ్లు బాగా జూసుకుంటే అదుష్టం. లేకపోతే వుట్టింటికి ఎళ్లగలవేటండి. ఓ అయ్య చేతిలో పెడితే పండక్కీ పబ్బానికీ రావొచ్చుగానీ ఎనక్కంటూ రాలేంగదండి. ఏ నుయ్యోగుయ్యో జూసుకోటవే."

ఆ విషయం కూడా అందరూ అంగీకరించారు. ఆదిశేషయ్య ఎందుకో తువాల్తో కళ్లు తుడుచుకున్నాడు.

"బాదపడకండి అన్నయ్యగారూ. అన్నింటికీ బగవంతుడు వున్నాడు. సిన్నదాన్నయినా తోబుట్టువుననుకోండి. మీరూ ఒదినిగారూ పెత్తిరపతి ఒస్తావని మొక్కుకోండి. అంతా బాగుంటాది."

"బానే వుందిగానీ. ఈడి బుద్ది పందిబుద్దయితే దేవుడు మాత్రం ఏం జెయ్యగలడు? మూర్తం పెట్టిన మా పంతులు ఆశ్లేషా నీ కూతురు అదుష్టవంతురాలు ఫో అన్నాడు. ఏందండి అదుష్టం? ఆడిచేత మక్కెలిరిగేట్టు తన్నుల్తినడం."

"అమ్మమ్మ అలాగనకండి. మా ఆడోళ్లు చెప్పినట్టు తిరపతోసారి పోయిరండి. అంతా సక్రవంగా జరుగుద్ది. మనం అనుకుంటావండి. కానీ పైవోడు అన్నీ చూస్తా వుంటాడండి."

అవునని తలూపుతూ జంతికలతను అన్నాడు.

"సివుడాగ్న అంతే."

దేవుడికి మొక్కుకోవడం ఎన్నిసార్లు చూడలేదు తను? తలనీలాలు ఇస్తానంది అమ్మ. వాళ్ల మాటలు వినడంలో గమనించలేదు కృష్ణమూర్తి. రైలు గన్నవరంలో ఆగి వుంది. తల బయట పెట్టి చూశాడతను. గాలికి జుట్టు చెదిరిపోయింది. జుట్టు సద్దుకుంటూ అందరివేపూ చూశాడు. రైలు ఆగిందని గమనించినట్టు లేదు వాళ్లు. ఇంతలో పెద్ద శబ్దం చేసుకుంటూ గూడ్సురైలు అవతలివేపు వచ్చింది. తీరిగ్గా పది నిముషాలు శబ్దం చేసుకుంటూ భారంగా వెళ్లిపోయింది రైలు.

"ఏ ఊరండి?" కృష్ణమూర్తిని అడిగేడు ఆదిశేషు.

"గన్నవరం"

"బెజవాడ దగ్గిరికి వచ్చేశాం."

"ఆ. ఎంతండి పది నిముషాలు" అందామె.

జంతికలతను ఆవిడతో చెప్పకున్నాడు.

"క్రిష్ణలంక పోవాలి. మళ్లీ రేపు ఊరు బోవాలండి."

"ఇంకేం రోజూ ప్రెయాణాలే మీకు?"

"ఆ. ఎందుకొచ్చిన ప్రెయానాలండి. మనింట్లో కూచున్నంత సుఖం ఉందేటండి. తప్పకా ఇయన్నీ. అమ్మ, మొత్తానికి బండి కదిలింది."

జంతికలతని వేపు చూశాడు కృష్ణమూర్తి. జంతిక బదులు బీడీ నోట్లో పెట్టి వెలిగించాడతను. రైలు వేగం పుంజుకుంది. కృష్ణమూర్తి కదుపులో బుడగ

మనీషా సూక్తులు

అందగత్తెలయిన ఆడపిల్లలకు ఆత్మశాంతి తక్కువ. గట్టిగా నవ్వినా తప్పే నవ్వకున్నా తప్పే. ఏం మాట్లాడినా వింతే. ప్రతి మాటలోంచి వెధవ అర్థాలు లాగుతారు. నా బాయ్ ఫ్రెండ్ల గురించి, నా వెరైటీ స్నేహాల గురించి పత్రికల వాళ్ళకి ఆరా ఎక్కువైంది. నేను వటిగానే గాని బానిసను కాను. నా వ్యక్తిగత జీవితం మీద ఎందుకింద దుమారం లేవుతారు? 'మంచమ్మాయి' ముద్ర నాకొద్దు. మంచిగా వుండటం అంటే జనానికి వాళ్ళు పెట్టే నీతులకి రూల్స్‌కి లొంగి వుండటం.

అంటూ మనీషా కొయిరాల ఈ మధ్య వాకృంది.




సుఖమయ దాంపత్యానికి
పసందైన మన్మధబాణం

ఒజోమెన్
క్యాప్సూల్స్

రెపరెపలాడే యవ్వన శక్తికి ✪ సాటిలేని సంతృప్తికి

ప్రతి రాత్రి 2 పాలతో సేవించండి

4 క్యాప్సూల్స్ గల 2 ఖాళీ ఫాయిల్స్ పంపిన వారికి ఒక పర్సు ఉచితం

మరిన్ని వివరాల కోసం పోస్టు కార్డు వ్రాయండి.
ఫిజికెమ్ లేబరేటరీస్
పి.బి. నెం. 84, విజయవాడ - 520 001.

అన్ని మందుల షాపులలో లభిస్తాయి

ఇంకా పెద్దదైంది. విస్సహాయంగా బయటకు చూశాడతను. రైలుపెట్టెలో ఒక్కడే కూచు న్నట్టనిపించిందతనికి. టై ఎందుకో బిగుతుగా అనిపించింది.

ఆదిశేషు అడుగుతున్నాడు – "ఒంగోలు బండి ఉంటదంటారా?"

"బండో బస్సో వొచ్చెదున్నాయి. ఏదో ఒకటి దొరుకుద్ది" ఆడమనిషి భర్త ధైర్యం చెప్పేదు.

"మళ్లీ కాస్త టీనీళ్లు దాగి, ఏందండీ, బండెక్కి కళ్లుమూసుకుంటే పాయె. ప్రేణం ఇసిగిపోయిం దమ్మా. దాని కర్మకి దాన్నొదిలి సచ్చేపోయిందను కోవాల్సిందే."

విర్మోహమాటంగా ఆదిశేషుని చూస్తూ అతని మాటలు వింటున్నాడు కృష్ణమూర్తి.

ఆమె అందుకుంది. "అయ్యో. అంతమాట అనగాకండి. మన బిడ్డని మనం జూడక ఎవురు చూస్తారండీ. పైకి ఎన్నిమాటలన్నా ప్రేణాలన్నీ కూతురుకాడే ఉంటయ్యండీ. మన బిడ్డ కాదంటే కాకుండా బోద్దా చెప్పండి."

"లేదులేవే. ఆ బాదలో అట్టా అనిపిస్తా వుంటది. అమ్మాయి బాద చూళ్లేకే గదా. దేవుడు ఒక్కోడికి ఒక్కోటి పెడతా వుంటాడండి. అయేం లేకపోతే దేవున్ననలు పట్టించుకునేదెవడండి? మీరు బెంబే లుపడిపోతా వుంటే మీ ఆడోళ్ల గతేంటి? మంచో సెడో ఒకళ్లకొకళ్లు చెప్పకుంటా వుంటే గుండె బారం తగ్గుద్దండి. అంతే గదండీ! ఇప్పడీయన తీర్చేవోడూ గాదు, నేను తీర్చేవోణ్నీ గాదు."

"ఏందోలెండి. ఇంక మనవల్ల గాకపోతే గవ ర్నమెంటోడి దయవల్ల ఇంటో పురుగుమందు ఉంటదిలెండి."

"ఛఛ. ఎంత మాటన్నావయ్యా. అసలు మన నోటెంబడ రాకూడదండి. తదాస్తు దేవు ళ్లుంటారు. తప్పయ్యా బాబూ" ముందుకు ఒంగి ఆదిశేషువేపు చూస్తూ సూటిగా కోప్పడ్డాదు జంతి కల యజమాని.

"అవునండి. మా ఆడాళ్లనుకున్నా అర్థం వుంది. అట్లనగాకండి అన్నయ్యగారూ. ఇంటా వుంటేనే బాదగా వుంది."

జంతికలాయన బీడీ మళ్లీ వెలిగించి ఆదిశేషుని చూస్తూ అన్నాడు.

"మంచిగావొచ్చండి సెడ్డగావొచ్చండి. ఒకళ్లకోసం బతకడవేటండి. సావడవేటండి? నా తోడబుట్టిన వాడే ఎదవ అయిపోయి నామీద కోర్టు వాజ్యం వేసేదు మరి. నన్నూ నా కుటుంబాన్నీ దిక్కులే కండా జేస్తానని చేలంజి చేసేడండి ఎదవ. నేనేం పాపం జేసేనంటారు! నేను దిక్కులేక అడుక్కు తింటా వుంటే ఆడికేం ఒచ్చుద్దంటారు. అంటే తోడబుట్టే కూడా సెపించాడన్నమాట. సేపం. కోర్టుచుట్టూ తిరుగుతున్నాం. రేపదే ప్రెయాణం లెండి. మరాడికి నేనేం అపకారం చెయలేదండి."

రైలు గుణగల దాటిపోయింది. కృష్ణమూర్తికి కడుపులో బుడగ పూర్తిగా ఉబ్బిపోయింది. గొంతు ఎండిపోయి, విసుసుకుపోయినట్టయింది. టై ముడి మళ్లీ సవరించాడు. కళ్లలోంచి నీళ్లు చిమ్మేయతనికి. చటుక్కున తల బయటపెట్టి చూశాడు. మెత్తగా గాలి మొహానికి తగుల్తోంది. కళ్లనీళ్లు కారేయి. ముక్కు ఒకసారి ఎగపీల్చి జేబు లోంచి రుమాలు తీసి కళ్లు బాగా వత్తుకుంటూ తల లోపలపెట్టేదు. కన్నీళ్లకి తడిసిన రుమాలు జేబులో కుక్కుకున్నాడు.

"చల్లగాలి గదండీ. కళ్లంబడి నీళ్లు తిరుగు తయి."

నవ్వుతూ కృష్ణమూర్తివేపు చూసి అన్నాడు ఆది శేషు. తల ఊపేదు కృష్ణమూర్తి. ప్లాట్‌ఫారంమీదికి పాకుతూ వచ్చి ఆగింది రైలు. ఆదిశేషు తువాలు సద్దుకుని లేచే ప్రయత్నంలో వున్నాడు. ఆడమ నిషి, భర్తా సంచీ తీసుకుని లేచేరు. కృష్ణమూర్తి లేవగానే దారిచ్చేరు వాళ్లు.

ఆమె అంటోంది– "ఉంటావండి అన్నయ్య గారూ. మీకు రైలు దొరుకుద్దిలెండి."

కృష్ణమూర్తి ప్లాట్‌ఫాంమీద పోగవుతున్న జనం లోంచి ఒంటిగా నడిచాడు.

## గుమ్మపాలలో విషపుచుక్కలు



తీరం మీద తీతువ కూత
శబ్ద కాలుష్యం
తీరం ఇప్పుడు విదేశీ ప్రేమికుడై
నీలి కన్నుల సుందరాంగి
పాలిచ్చి పెంచిన గంగమ్మ స్పర్శ
ఇప్పుడు పరాయిది.
జీవితాన్ని నిమరి ఓదార్చిన కెరటాలపై
విదేశీ వేలి ముద్రలు
ఉప్పుపంటా, చేపలు వేలూ
విద్రోహ చర్యలు
తీరం ఇప్పుడు జాతీయాదాయ జీవ నాడి
ఒక జీవనోపాధి , ఒక జీవన శైలిపై
పరుచుకున్న
కార్పొరేటర్ బోట్ల మృత్యునీడ
శిధిల నావలూ,
చివికిన వలలూ
పాలిపోయిన గంగమ్మ పెట్టు జాతర
కూలి గింజల కోసం
వలస పక్షులైన మత్స్య కారులు
తీరం ఇప్పుడు వలసవాదుల కౌగిలిలో
తుఫాన్లనూ, ఉప్పెనల్నీ ముద్దాడిన వాళ్ళే
ఇప్పుడు రెక్కలిరిగిన తెల్లకాకులు
తీరం మీద జీవితం
మొక్క తోటలో మిగిలిన మనేద
తీరం ఇప్పుడు కార్పొరేట్ యుద్ధ క్షేత్రం.

ఆకుల చలపతి